## కథానిలయం వార్షికోత్సవం - 14-02-2010 - శ్రీకాకుళం



ఎడమ నుండి కుడికి : కా.రా., రామారావునాయుడు, లక్ష్మీనారాయణ, కోడూరి, అప్పలనాయుడు, వివినమూర్తి

## రాచకొండ రచనా పురస్కారం - 14-02-2010 - శ్రీకాకుళం



**కాళీపట్నం రామారావుగారి నుంచి పురస్కారం స్వీకరిస్తున్న డి.వెంకట్రామయ్య**

ఆన్‌లుకర్స్ : కవనశర్మ, 'రచన' శాయి, భండారు శ్రీనివాసరావు

**తొలి ఆధునిక తెలుగు కథ శత వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా**

# దీపావళి కథల పోటీ!

## రు. 15,000/- + 6,000/- బహుమతులు!

**తె**లుగు కథ శతవార్షికోత్సవాలు గత సంవత్సర కాలంలో ఎందరో ఎన్నో విధాలుగా తమకు తోచిన రీతిలో అంగరంగ వైభోగంగా నిర్వహించారు. పరిమితుల మేరకు 'రచన' కూడా ఆ దిశగా అడుగులు వేసింది. అంతటితో ఆగిపోకుండా భవిష్యత్తులో కూడా ఆ వరవడిని కొనసాగించాలనే తపనతో ఉంది.

**అందులో భాగమే ఈ ప్రత్యేక కథల పోటీ!**

తెలుగు కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేయబూనిన ప్రయత్నాలలో ఇది మరొక ముందడుగు కాగలదు. తగినంత సమయం ఇవ్వబడింది కాబట్టి కథకులందరూ ఇతోధికంగా - స్వేచ్ఛగా - కృషి సల్పి ఈ పోటీ ద్వారా మరిన్ని గొప్ప కథలను తెలుగు పాఠకులకు అందించాలన్నది మా అభిలాష!

*కథల పోటీకి సూచనలు :*

- *కథావస్తువుని బట్టి కథ నిడివి కాబట్టి పేజీల పరిమితి లేదు.*
  *అలాగని నవలికలుగా రూపాంతరం చెందిన కథలను పోటీకి పంపరాదు.*
- ***రు. 3,000/- చొప్పున ఐదు కథలకు సమాన బహుమతులు.***
  ***వాటిలో మొదటి మూడు కథలకు రు. 3,000/-; రు. 2,000/-; రు. 1,000/- చొప్పున ప్రత్యేక బహుమతులు.***
- *కథావస్తువు ఏదైనా కావచ్చు. సమకాలీన జీవితాన్ని, మానవత్వపు విలువల్ని ప్రస్ఫుటింపజేసేవిగా ఉండాలన్నది మా అభిమతం. అలాగని కథలు కేవలం సీరియస్‌గా రాయబడాలన్నది కొలమానం కారాదు. విలువల్ని విడనాడకుండా ఆహ్లాదకరంగానూ రాయవీలుంటుంది గదా!*
- *బహుమతి పొందిన కథలు కాక, మా పరిధుల మేరకు, ప్రచురణార్హం అనుకున్న కథలు 'రచన'లో సాధారణ ప్రచురణకు అంగీకరింపబడతాయి. వాటికి ఎలాంటి నగదు పారితోషికమూ ఉండదు.*
- *అను ; ఐలీప్ ; లేఖిని; యునికోడ్ ; విజన్ - చిత్ర, మేఘన ; బరహా; శ్రీలిపి లలో టైపు చేసిన వారు సాఫ్ట్ కాపీలు సిడిలలో పంపవచ్చు - కాని హార్డ్ కాపీలు కూడా తప్పనిసరిగా పంపాలి.*
- *తగినన్ని స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవర్లను జత చేసిన కథలు మాత్రమే, ప్రచురణకు అంగీకరింపబడని సందర్భంలో, త్రిప్పిపంపడం జరుగుతుంది.*
- *బహుమతుల నిర్ణయంలో సంపాదకునిదే తుది నిర్ణయం.*
- *పోటీ ఫలితాలు, బహుమతులు అందజేస్తున్నవారి వివరాలు దీపావళి (నవంబర్) సంచికలో.*

*కథలు పంపాల్సిన చిరునామా :*

'రచన' ఇంటింటి పత్రిక, 1-9-286/2/P, విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర), హైదరాబాద్- 500 044.

**కథలు అందాల్సిన చివరి తేదీ : 10 జూలై, 2010**

సంపుటి:9
సంచిక :12
మార్చి : 2010

208

పేజీలు : 100
వెల :
రూ.25/-

ఇంటింటిపత్రిక

ముఖచిత్రం : **అమెరికా తెలుగు కథానిక** ముఖచిత్రం : బాపు

చిరునామా : 1-9-286/2/P; "యడ్లపాటివారి ఇల్లు"; విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర); హైదరాబాద్ - 500 044.
ఫోన్ : (ఆ): 040 - 2707 1500 :: (ఇ): 040 - 2707 7599
*email : rachanapatrika@hotmail.com, rachanapatrika@gmail.com ; www.rachana.net*

సంపాదకీయం..... 5

ప్రత్యేకరచన : కథ... మంచి కథ... గొప్ప కథ... అమెరికా తెలుగు కథ! 6

## కథలు

కథాపీఠం కథ :: పెన్నులు
- టి. సంపత్‌కుమార్ 24

దిశ మారని దశ
- చావా శివకోటి 44

వీలునామా
- స్వాతీ శ్రీపాద 50

పంచశిఖలు
- ఆర్. శర్మ దంతుర్తి 55

కథాప్రహేళిక కథ :: దూరపు కొండలు
- యల్లాప్రగడ 59

ఆడవారి మాటలకూ అర్థాలే వేరులే!
- 'సీతాసత్య' 63

అనగనగా ఒక మంచి కథ :: లోపలి రక్కసి
- పి. శ్రీనివాసరావు 12

## శీర్షికలు

ఉత్తరరచన :: నా అభిప్రాయం 6

పజిలింగ్ పజిల్ – 208
నిర్వహణ : డా॥ ఎన్. సురేంద్ర 8

రచనాసమీక్ష - పి.వి.ఆర్. 69

సాహితీ వైద్యం - వసుంధర 75

కథాగతం
నిర్వహణ : వివిన మూర్తి 81

## సీరియల్ రచనలు

ఉల్లాసంగా....ఉత్సాహంగా....
- వసుంధర 12

నా రేడియో అనుభవాలు
- డి. వెంకట్రామయ్య 93

అమెరి'కాకమ్మ'కబుర్లు
- వంగూరి చిట్టెన్ రాజు 96

## అక్కడక్కడక్కడా

కార్టూన్లు

వచ్చే సంచిక .....

'చందమామ' దాసరి సుబ్రహ్మణ్యంగారి సంస్మరణ సంచిక!

The Views, Opinions expressed and Statements made by the Writers, Authors and Readers need not necessarily be those of the Editor and Management of Rachana Entinti Patrika.
All disputes will come under the exclusive jurisdiction of respective Courts and Forums situated in Hyderabad City only.

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా



**మార్కెటింగ్**

**పచిపాల మార్కెటింగ్**
3-6-136/6, స్ట్రీట్ నెం. 17
హిమయత్‌నగర్,
హైదరాబాద్-29
ఫోన్ : 040 - 40077558
మొబైల్ : 9848630702

*సంపాదకుడు*
**వై.వి.యస్.ఆర్.యస్.తల్పశాయి**

*అసోసియేట్ ఎడిటర్*
'హంసలేఖ'

*The Only Magazine Administered by Writers*

**ఇ**టీవలే నలుగురు సాహితీ వేత్తల శతజయంత్యుత్సవాలు జరుపుకున్నాం. సభలు, ఉపన్యాసాలు, వారి రచనల సంపుటాల ప్రచురణ – అంతే!

ఆధునిక తెలుగు కథ శతజయంతి ఉత్సవాలు గత ఏడాది పొడుగునా జరుపుకున్నాం. అంతటితో ఆగిపోకుండా ఎవరికి వారు తమకున్న పరిమితుల మేరకు ఆ ఉత్సవ సంబరాల్ని ఆలోచనాత్మక పథాన మున్ముందుకు కొనిపోవాల్సిన ఆవశ్యకత ఉంది. అప్పుడే శతజయంతి ఉత్సవాలకు ఓ పరమార్థం ఉంటుంది. అందులో భాగంగానే –

నిడివితో నిమిత్తంలేని కథల పోటీని ఈ సంచికలో ప్రకటిస్తున్నాం – రచయితలకు నాలుగు నెలల గడువునిచ్చి.

పోటీ కోసం కథలంటే ఒకానొక చట్రంలో ఇమిడితేనే బహుమతులొస్తాయనే ప్రగాఢ నమ్మకం రచయితలలో ఉంది. అందుకు దోహదం చేస్తున్నది పత్రికా నిర్వాహకులూ, వారు నిర్దేశించిన పరిధులకు లోబడి నిర్ణయాలు చేస్తున్న న్యాయనిర్ణేతలూనూ. *'మానవ సంబంధాలను హృద్యంగా చిత్రించే ఆహ్లాదకర కథ గానీ, హాస్య కథ గానీ బహుమతికి అనర్హమా!?'* అన్న మీమాంస చాలామంది కథకుల్లో ఉంది. ఆ దురూహను పారద్రోలాల్సిన ఆవశ్యకత అందరి మీదా ఉంది. అందుకు రచయితలే అనువైన తూణీరాలు సమకూర్చుకొని నడుంకట్టాలి – సాధించాలి.

కొమ్మూరి సాంబశివరావుగారు రాసిన పెద్దకథ లేదా చిన్న నవలిక *"ఇదంతా ఎవరి కోసం?"*లో ఇతివృత్తం ఆడ మగ అనుబంధానికి సంబంధించినదే అయినా ఒక సామాన్య స్త్రీ తాను నిస్వార్థంగా ప్రేమించినవాడు పిరికివాడై పారిపోతే, ఎదురైన గడ్డు సమస్యల్ని ఎదుర్కొని ఎలా నిలబడిందన్నదీ, ఆ పిరికివాడే చైతన్యవంతుడై ముప్ఫయ్ అయిదేళ్ల తర్వాత కన్న కొడుకు కోసం తాపత్రయపడుతూ వస్తే ఎలా స్పందించిందీ హృద్యంగా చిత్రీకరించారు – ఊహకందని ముగింపుతో. ఇప్పుడు ప్రాచుర్యంలో ఉన్న 'సామాజిక న్యాయం' ప్రస్ఫుటంగా ప్రతిఫలించిన రచన అది. కథ పూర్తయ్యేసరికి మనసు ఆర్ద్రమౌతుంది. జాలితో, కరుణతో కనులు చెమ్మగిల్లుతాయి. 1964 నాటి ఈ కథ ఈనాటికీ తాజాగా జ్ఞాపకాలలో ఉండడం ఆ కథ విలువను చెప్పకనే చెప్తుంది మరి!

పెద్ద కథలకు పత్రికల్లో 'చోటు' లభించడం లేదన్న ఆరోపణలను, అపోహలను ఈ మా ప్రయత్నం కొంత నివారించగల దనుకుంటున్నాము. ఈ పోటీలలో బహుమతులు అందిస్తున్న వారి వివరాలను ఫలితాలతో పాటుగా ప్రకటించగలమను కుంటున్నాము.

ఈ సంచికలోని 'ప్రత్యేక రచన'లో ప్రస్తావించినట్లు నలభయ్యవ దశకంలో కూడా కొందరు లబ్ధప్రతిష్ఠులైన కథారచయితల పేర్లే ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈనాటి లాగే ఆనాడూ చాలా మంచి కథలు రాసిన వారు చాలామందే ఉన్నా వారి పేర్లకు, రచనలకు తగినంత ప్రాచుర్యం లభించలేదన్నది కాదనలేని సత్యం.

'కథానిలయం'లో నిరంతరం సేవచేసే అవకాశం లభించిన వివినమూర్తిగారికి అలనాటి కథలన్నింటినీ చదవాల్సిన అగత్యం ఏర్పడింది. అదొక వరం అయింది ఆయనకు. ఆ క్రమంలో తారసపడ్డ కొన్ని అపురూప కథలను *'కథాగతం'* శీర్షికన 'రచన' పాఠకులకు అందించ సంకల్పించారు. ఈ కథలు మనకు సరికొత్త కథా ద్వారాలను తెరువగలవన్నది మా నమ్మిక. ఇందులో వచ్చే కథల మీద పాఠకులను సహేతుకంగా స్పందించమని కోరుతున్నాము.

శాయి

**208**

*ఈ పత్రిక మీది! మీఅభిరుచుల మేరకు పత్రికను రూపొందించడం మా వంతు!! అభిమానించి ఆదరించడం మీ వంతు!!!*

# ఉత్తర రచన



రచన సంపాదకులకి

వరసగా ఇద్దరు మిత్రులకి రాచకొండ రచనా పురస్కారం లభించడంతో ఈ లేఖ రాయాలనిపించింది. రామకోటి గారూ, డి. వెంకట్రామయ్య గారూ సహృదయులూ, పురస్కారానికి అర్హులూనూ.

నేనూ, ఎన్నెస్ (ప్రకాశ రావు), బిటి (రామానుజం), రాచకొండ నారాయణ మూర్తి రామకోటిగారి ఇంటికి పోయే వాళ్లం. మమ్మల్ని చూస్తూనే పనంతా పక్కన పెట్టి మమ్మల్ని ఆదరంగా ఆహ్వానించి కబుర్లలోకి దిగే వారు. ఎందరో రచయితల గురించి చర్చించుకునే వాళ్ళం. అందులో రాచకొండ వారు కూడానూ.

డి. వెంకట్రామయ్య గారు ఆ గ్రూపులో చంద్ర, రాజా రామ మొహనరావు, శ్రీపతి లాగే మొదటి పరిచయంలోనే ప్రాణ మిత్రుడి లాగ ఆదరించేరు. ఆయన ముఖంలో ఒక చల్లని వెలుగు కనిపించేది. ఆయన్ని కలియక ముందు కూడా నేను ఆయన అభిమానిని. వార్తలు చదువుతున్నది డీ వెంకట్రామయ్య అన్న గొంతుకకి అభిమానిని.

ఇద్దరూ ఎన్నో కథలు రాసేరు. వాటి విలువ పురస్కారమే చెప్తోంది.

ఇద్దరికీ అభినందనలు.

మరువాడ రాజేశ్వర రావు

# నా అభిప్రాయం



శ్రీ శర్మగారికి

నమస్కారములు!

సెప్టెంబర్ - 2009 'రచన' ద్వారా మీ కొత్త పుస్తకాల్ని 'వాహినీ బుక్ ట్రస్ట్' ప్రచురించిన వైనం తెలిసి మహదానందం కలిగింది. 'శాయి'గారికి పైకం ఎమ్.ఓ. చేద్దామనేలోగా విశాఖపట్నం వెళ్లడమూ, అలవాటులో పొరపాటుగా విశాలాంధ్ర బుక్‌హౌస్‌కు వెళ్ళడమూ, మీ 'కోతి రాతల్నీ', 'మా కుటుంబా'న్నీ స్వంతం చేసుకోవడమూ వెనువెంటనే జరిగిపోయాయి.

ఎవరి రచనైనా బావుందనో, బావుండ లేదనో ఏదో ఒక అభిప్రాయం తేల్గాగానో, అవసరమైతే కొంచెం కష్టపడో చెప్పొచ్చు. కానీ మీ రచన కేవలం బావుందని చెప్ప డాన్ని మించిన అసంతృప్తికరమైన వాఖ్య మరొకటి ఉండబోదు.

ఏంబావుందో వ్రాయలంటే.. ఇంచు మించు మీ రెండు పుస్తకాల్నీ తిరగ వ్రాయాలి. అప్పుడు... అభిమాన రచయిత రచనల్ని మెచ్చుకునే సాకుతో యధా తథంగా కాపీ చేశానన్న అపప్రదకు లోను కావల్సి వచ్చే ప్రమాదం ఎంతైనా ఉంది. కిం కర్తవ్యం?

ఈ 'కిం కర్తవ్యం?' అనే ప్రయోగం చిన్నప్పుడు చదువుకున్న శబ్దమంజరి, అమరకోశం, రఘువంశం, కుమారసంభవం - ఇత్యాదులకు సంబంధించిన పైత్యపు అవశేషంగా అర్థం చేసుకోవాలని మనవి.

మీ రచనల్లో ఏం బావుందో, ఎందుకు బావుందో సవివరంగా చెప్పే ప్రయత్నాన్ని అతి కష్టం మీద ఆపుకుని 'ఊరుకున్నంత ఉత్తమం లేదు....' అనే మా పశ్చిమ గోదావరి జిల్లా సామెతను గుర్తుచేసుకుని ఊరుకోవడం మేలనిపిస్తోంది.

సగం మాత్రమే ఉదహరించిన పై సామెత ప్రతి తెలుగువాడికీ చెందుతుందనీ, దానిని కేవలం మా 'జిల్లా సామెత'గా ఉటంకించిన నా అజ్ఞానానికి మీరు కోపం తెచ్చుకోరనీ, కానీ ఆ సామెత ఏ జిల్లా వాళ్ల ద్వారా వెలుగులోకి వచ్చిందో ఎవరికీ తెలియదనే విషయంతో మీరు ఏకీభవిస్తారనీ నా నమ్మకం! కనుక ఎవరికి ఏ సామెత నచ్చితే వారు దానిని తమ ప్రాంతపు ఆస్తిగా చెప్పుకోవచ్చునేది తొలిసారిగా నా అపూర్వ మేధస్సుకు తట్టిన గొప్ప విషయంగా మీరు గుర్తించాలని నా వినతి!

అక్షరాలతో ఆడుకునే రచయితలు మనకు లేకపోలేదు. మీ రచనల ద్వారా మీరూ ఆ పనే చేసినా, చేస్తోన్నా... మీ రొక్కరే ఆ ఆట ఆడుకుంటున్నట్టుగా అనిపించదు. వ్రాసిన మీతో పాటు మీ రచనలు చదివే వేళలో పాఠకుడూ తాదాత్మ్యం చెందుతూ ఆ చమత్కారపు అక్షరాల ఆటను తానూ ఆడుకుంటాడు. మీ రచనల్లోని గొప్పతనం అది!

పాత రచనలు చదివే అలవాటు అంతగా లేకపోవడాన మీ శైలి ఏ ప్రాచీన రచయితల శైలి కైనా అనుకరణో కాదో నాకు తెలియదు. కానీ నేను చదివినంత

వరకూ అనన్య సామాన్యమైన, అద్భుతమైన శైలి మీ స్వంతం.

ఏ వ్రేలి ముద్రా మరో వ్రేలి ముద్రను పోలి ఉండదనీ.. *'శైలి వ్రేలి ముద్ర'* అని కూడా తెలియనివాడితో నాకెందుకొచ్చిన కాగితాల సహవాసం అని మీరనుకోరని నా నమ్మకం.

పై రెండు 'పేరా'ల ('పేరా'కు తెలుగు వెంటనే స్ఫురించని నా దౌర్భాగ్యాపు అజ్ఞానాన్ని మన్నించగలరు) లేదా పై మూడు వాక్యాల సంగ్రహాన్ని వ్రాయడం ద్వారా నాకూ కొద్దో గొప్పో బుర్రుందనీ అందులో కనీసం మైక్రాను పరిమాణంలోనైనా పనికొచ్చే గుజ్జుందనీ మీరనుకోవాలని నేను భావించినట్టుగా మీరు పొరబడితే … నా మనసులోని మాటను ఇట్టే పసిగట్టినందుకు ('పసిగట్టడ'మనే లక్షణం కేవలం విశ్వాసపాత్రమైన జంతువులకు సంబంధించింది మాత్రమే కాదని నా విశ్వాసం) మీకివే నా అభినందనలు!

కా.రా. గారి సప్తతి ఉత్సవ సందర్భంలో శాయిగారు మిమ్మల్ని నాకు పరిచయం చేయగా, ఆ సమయంలో తాజాగా విడుదలైన మీ 'వ్యంగ్యకవనాల్ని' మీ సంతకంతో స్వంతం చేసుకున్నప్పటి అనుభూతి ఎప్పటికీ చిరస్మరణీయమే! ఆ తొలిపరిచయంలో మీ రచనల్లోని, 'మెరుపూ, విరుపూ, చమక్కూ' మీ మాటల్లోనూ ఆశీర్వదించగలగడం ఒక తీయని అనుభూతి.

ఇటీవల జరిగిన మీ సప్తతి ఉత్సవ సంరంభానికి రాక పోవడమూ, కనీసం శుభాకాంక్షలూ చెప్పకపోవడమూ వెనుక ఉన్నదురుద్దేశ్యం ఒక్కటే! మీకు సహస్ర చంద్ర దర్శనం అయ్యే శుభ ఘడియ కోసం ఎదురు చూస్తోన్న నాకు సప్తతి ఉత్సవం చాలా చిన్నదిగా అనిపించడమే!

యండమూరి – తన రచనల్లో అప్పుడప్పుడూ ఉపయోగించే మెంటల్ ఎజాక్యులేషన్ అనే పదానికి సరైన అర్థం నాకు తెలియదు. కానీ మీ రచనలు చదువుతోంటే అటువంటిదేదో నా మెదడులో జరుగుతున్నట్టే అనిపిస్తూంటుంది. ఇది సహజమో, అసహజమోననే విషయాన్ని కాలమో, నాడీ వ్యాధుల నిపుణులో తేల్చాల్సిన విషయంగా భావించి ఊరుకోవడం బోడిగుండంత సుఖమని భావిస్తున్నాను.

మీ మస్తిష్కపు ఊటబావిలోని జల నిరంతరం ఊరుతూ నాబోటి సాహితీ ఎడారి జీవుల దాహార్తిని అనవరతమూ తీరుస్తూనే ఉండాలని నా ప్రగాఢవాంఛ!

మీ రచనల ద్వారా చాలకాలం నుంచీ పరిచయస్తులైన శ్రీమతి శర్మగారికి నమస్కారములు! తాజాగా 'మా కుటుంబం' ద్వారా పరిచయమైన మీ చిరంజీవులకు ఆశీస్సులు.

మీకు నమస్కారాలు (వెటకారం కాదని మనవి) ముందే చెప్పేశా(సా)ను కనుక ప్రస్తుతానికి సె(శె?)లవు!

శుభాకాంక్షలలో
ఎప్పుడూ నిద్రపోతూ
అప్పుడప్పుడూ నిద్రలేచే
మీ అభిమాని
కెవివి
సత్యనారాయణరాజు

*P. S. లేదా epilogue లేదా కొసరు మెరుపు అను బూమెరాంగ్ ప్రయోగం :*

"నా అభిమానుల నిజాయితీని నువ్వు శంకిస్తూ ఉంటావు కానీ ఇదిగో చూడు.. ఇతనెవరో నిజంగా నాకు అభిమానే!" అనే పొరపాటు ఇన్ఫరెన్స్ (తెలుగు సమానార్థకం వెంటనే స్ఫురించని కారణంగా వ్రాయలేని నా అసహాయతను మళ్ళీ మన్నించాలి)కు మీరు వచ్చి అదే విషయాన్ని సామాన్యంగానో, గొప్పగానో మేడమ్ (తెలుగు సమానార్థకం తెలిసినా కావాలనే వ్రాయలేదని చెప్పుకోవడం అతి తెలివి తాలూకు పైత్యప్రకోపపు లక్షణాన్ని సూచించినట్టనిపించినా నా ఉద్దేశ్యమూ అదే కాబట్టి ఫర్వాలేదు) గారి దగ్గర పొరపాటున వ్యాక్తీకరించే ప్రయత్నం చేస్తే గీస్తే అందుకు వారు "అభిమానీ కాదూ.. పాడూ కాదూ... 'వీడెవడో' (మర్యాదపూర్వకంగా అయితే 'ఇతనెవరో') గానీ మీ కోతిరాతల్నీ, కొండముచ్చు రాతల్నీ, చమత్కారపు 'ముసుగు' ('పరదా' అంటే వ్యంగ్యపు తీవ్రత కొంచెం తగ్గే అవకాశముంది)లో మీరు తెలివిగా కొట్టుకున్న 'మన కుటుంబపు' డబ్బానీ కూడా మెచ్చుకున్నాడంటే కొద్దో గొప్పో పిచ్చో లేదా వేరే దురుద్దేశ్యమో ఉండే ఉంటుంది. 'వీడి'కి (బయటి వాళ్ళతో చెప్పేటపుడైతే 'ఇతని'కి). మీ అభిమానిననే తెర అడ్డం పెట్టుకుని – 'నా గొప్పతనాన్ని మీరు కూడా గుర్తించాలి సుమా!' అనే ధోరణిలో తన అతి తెలివిని ప్రదర్శించడం మీదే ఎక్కువ శ్రద్ధ పెట్టిన ఈ తలతిక్క మనిషి…. కొన్ని రోజులు పోయాక మీ శిష్యుణ్ణనీ, మీరు తనకు గురుతుల్యులనీ, మరో ఉత్తరం వ్రాస్తే గీస్తే.. పొంగిపోయి మీరు గురుపీఠాన్ని లంకరించదలచుకుంటే అది పూర్తిగా మీకు మాత్రమే సంబంధించిన విషయం. కానీ నన్ను మాత్రం 'గురుపత్ని' అంటే మర్యాద దక్కదని మీరూ తెల్సుకుని, వాడికీ (గౌరవపూర్వకంగా 'అతని'కీ) తెలియ చెప్పండి!" అని అంటే వారికి మరోసారి నా నమస్కారములు! ఎందుకంటే సందర్భం కాకపోయినా ఒక విషయం చెప్పాలి – లెక్కలంటే ఉన్న విపరీతమైన భయం వల్లే నేను ఎంతో కష్టపడి M.Sc., Botany చదివాను మరి!

– కెవివి సత్యనారాయణరాజు
*(మినుములూరు)*

కథాపీఠం

# పెన్నులు

> సాధనమున పనులు సమకూరు
> ధరలోన! రచయితకి కలం సాధనం!
> – వసుంధర

పెన్నంటే నాకు ప్రాణం. అందమైన పెన్నుల్ని చూస్తే చిన్నపిల్లవాడినైపోతాను. వాటిని ఆప్యాయంగా స్పృశించి కాగితంపై వ్రాసి చూస్తే పరమానందం నాకు. సాఫీగా రాసే పెన్నుతో నేను అందంగా ముత్యాల్లా నాకు ఆ క్షణంలో తోచిన పేరును రాస్తాను. ఎక్కువమటుకు నా ప్రేయసి పేరునే రాసు కుంటాను. చెప్పుకోకూడదుగాని నా రాత బాగుంటుంది. కావా లంటే నా మిత్రుల్ని అడగండి. ఎవర్నడిగినా అదేమాటంటారు. ఆ మాటల్ని విన్నప్పుడల్లా నేను గర్వపడిపోతాను. వెంటనే చిన్నప్పటి ప్రైవేటు పంతులు కొట్టిన దెబ్బలు, నాన్న తొడపాశం తప్పక గుర్తుకొస్తాయి. ఆ దెబ్బలు తీపి రూపం దాల్చి, అమ్మలాంటి తియ్యని తెలుగు భాషని కర్రదెబ్బలు తిన్న అరచేతులు కలాన్ని ఆప్యాయంగా పట్టుకొని ఇష్టంగా రాసుకుంటూ పోతే అచ్చంగా అమృతధారే!

పెన్నంటే మరీ ఇంత అభిమానం, ప్రేమ, ఇష్టం ఎప్పుడు, ఎలా కలిగిందో చెప్పలేను. అలా గుర్తుపెట్టుకొనే సంఘటన ఏదీ నా జీవితంలో జరగలేదు. ఇంకు పెన్నుల కాలంతోనే బాల్యం గడిచింది. అవంటే నాకు ఓ ప్రత్యేక అభిమానం. నెలకోసారి పెన్నుని విప్పి కడగడం, గాలికి ఆరబెట్టడం, వ్యాజ్‌లీన్ పెట్టి ఇంక్ లీక్ కాకుండా చూడడం....చివర్న బట్టతో చక్కగా తుడిచి మెరిసేటట్టు చేయడం....నాకు వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు వాటిని చూస్తుంటే పాత మిత్రులు గుర్తుకొస్తారు. బహుశా నేను పదవ తరగతిలో ఉన్నప్పుడనుకుంటాను – మొదటిసారి బాల్ పెన్నుని మా ఊరి మందుల షాపులో చూశాను. అప్పట్లో వాటిని 'నొక్కుపెన్ను'లని పిలిచేవారు. గత ముప్ఫై ఏళ్లలో పెన్నుల్లో ఎన్నో పోకడలు. హైటెక్ రంగులు, హంగులు, షోకులు....ముచ్చటగొలిపే పెన్నులు, బంగారు పెన్నులు, వజ్రాలు పొదిగిన పెన్నులు ....

**డి. సంపత్‌కుమార్**

ఇంకు పెన్నులు వృద్ధాశ్రమంలో ఉన్నాయి. ఎక్కడో 'పొరపాటున' కనబడతాయి....పాళీ పెన్ను వాడితే విచిత్రంగా చూస్తారు ఈ రోజుల్లో ....

ప్రపంచంలో చిత్రవిచిత్రమైన హాబీలు. నాణేల సేకరణ, స్టాంపుల సేకరణ...అందరికీ తెలిసినవే! కొన్ని హాబీలను చూస్తుంటే నవ్వొస్తుంది. ఎవరి హాబీ వారిది! సీరియస్‌గా హాబీలను కొనసాగించేవారి నడిగితే తెలుస్తుంది, అందులో ఎంత ఆనందం ఉందో....ఓహ్.....

నాకో హాబీ ఉంది. పెన్నుల్ని సేకరించడం. నా ఉద్యోగరీత్యా దేశమంతానూ, అప్పుడప్పుడు విదేశాలు కూడా తిరుగుతుంటాను. నా ప్రయాణాలు కేవలం పట్టణాలకే పరిమితం కావు. గ్రామీణాభివృద్ధి రంగం కాబట్టి ఆదివాసులుండే అడవులు మొదలుకొని నియాన్ లైట్లలో తడిసిపోతూ జిమ్‌చిక్ జిమ్‌చిక్ శబ్దాల్లో తేలిపోయే భవనాలకు, రోడ్డుకు కూతవేటు దూరంలో ఉండే మహా మురికివాడల వరకు తిరుగుతుంటాను. రాత్రిపూట బస – ఆయా స్థలాల్ని బట్టి – పంచాయత్ భవన్ నుంచి పంచ నక్షత్ర హోటలు దాకా ఆఫీసు ఏర్పాటు చేస్తుంది. హోటళ్ళు లేనిచోట స్థానిక సంస్థల సహాయంతో కనీస వసతులతో సర్దుబాటు తప్పనిసరి.

పెద్ద పెద్ద హోటళ్ళల్లో అన్ని సౌకర్యాలు, హంగులతో పాటు పెన్నుల్ని, చిరునోటు బుక్కుల్ని (నోటింగ్ పాడ్) కూడా ఉంచుతారు. నేను ఏ హోటల్లో ఉంటానో దాని గుర్తుకుగాను ఆ గదిలో ఉంచిన పెన్నునొకటి తీసుకుంటాను. మామూలు పెన్నులైతే తీసుకొనేవాణ్ణి కాదు. ఆ బాల్ పెన్నులపై ప్రింటు చేసిన హోటల్ పేర్లు నన్ను ఆకర్షిస్తాయి. పెన్నుపై ఉన్న ఆ అక్షరాల్ని, హోటల్ పేరుని చూసుకుంటే నేను ఏ ప్రాజెక్ట్ చూసానో, దానితో ముడివేసుకున్న ఎన్నో విషయాలు గుర్తుకొస్తాయి. అవే కాక నా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన



విషయాలు, ఎవరెవరు వచ్చి నన్ను కలిసింది, వారంతాల్లో తిరిగింది, ఏవేమి రచనల్ని మొదలు పెట్టింది, కొనసాగించింది....ఎన్నో ఎమోషన్స్ నిండిన తీపి – చేదు జ్ఞాపకాలు కూడా ఠక్కున గుర్తుకొస్తాయి. అలా అపురూపంగా పోగుచేసిన పెన్నులు నా దగ్గర చాలా ఉన్నాయి.

గత పాతికేళ్ళకు పైగా ప్రయాణం చేస్తున్న నేను మొదటినుంచీ మొదలుపెడితే ఎన్ని పెన్నులు నా దగ్గర ఉండేవో? ఇరవై సంవత్స రాల నుండి చాలానే పోగుచేసాను. బస చేసిన ప్రతి దేశ విదేశ హోటల్ నుండి తెచ్చిన వీటిని ఓ చక్కని డబ్బాలో భద్రంగా దాస్తాను. అది నా ట్రెజరీ....జ్ఞాపకాల భాండాగారం. ఒక్కో పెన్ను ఒక్కో కథ....ఒక్కో నవల....ఆ జ్ఞాపకాల్ని రాతరూపంలోకి అనువాదం చేయాలే కాని ఎన్నో రచనలు పుట్టుకురావచ్చు.

కొన్ని హోటళ్ళలో పెన్సిళ్ళను పెట్టే ఆచారం ఉంది. వాటిపైన హోటల్ పేర్లుంటాయి. అయితేనేం, వాటిని చూసినంత మాత్రానా నా జ్ఞాపకాలు తేలికపడవు కదా! అవీ పెన్నుల పక్కనే దర్జాగా డబ్బాలో పక్కపక్కనే నిద్రిస్తాయి. ఒకటే పెద్ద తేడా... పెన్నుల్ని వాడినా బాహ్యంగా చెక్కుచెదరకుండా అందంగా అలానే ఉంటాయి. కేవలం రీఫిల్ ఖాళీ అవుతుంది. కాని పెన్సిల్ కత్తి కోతకు గురవుతుంది. ఆ నరకయాతనలో, చిత్రవధలో హోటల్ పేరు సమసిపోతుంది....చివరకు తన ఉనికినే కోల్పోతుంది పెన్సిల్...అదిష్టంలేక పెన్సిళ్ళని వాడకుండా అట్టే పెట్టేసాను.

ఒక పట్టణానికి పదేపదే పని ఉంటే ఒకే హోటల్లో ఉన్నాను. మార్పు మంత్రాన్ని అమలు చేస్తారు కాబట్టి పెన్నుల ఆకారం, అందాలు కూడా మారుతుంటాయి. ఒక హోటల్లో ప్లాస్టిక్‌తో చేసిన పెన్నులుండేవి. పర్యావరణ సంరక్షణానికి పెద్దపీట వేస్తున్నా మని చాటుకోడానికి ఆ హోటలు ఈ మధ్య ప్లాస్టిక్కు బాడీలకి స్వస్తి చెప్పి, రీసైకిల్ చేసిన పేపరుతో చేసిన బాడీ ఉన్న పెన్నుల్ని పెడుతున్నారు. నా డబ్బాలో ఇలా ఒకే హోటల్‌కి చెందిన, అవ తారాలు మార్చిన, పెన్నులు కూడా ఉన్నాయి.

మూణ్ణెల్ల క్రితం అరవై దాటాను. ఎంత సంతోషమో? ఈ నా టైము కోసం ఐదేళ్ళ ముందునుండే ఎదురు చూస్తున్నాను.

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*




తెలుగు కథకు ఆద్యులైన భండారు అచ్చమాంబ (1902), ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ (నవంబరు 1903), గురజాడ అప్పారావు (ఫిబ్రవరి 1910), మాడపాటి హనుమంతరావు (జనవరి 1912) గార్లను సంస్మరిస్తూ, వారి దివ్యస్మృతికి వంగూరి ఫౌండేషన్‌వారు ఈ బృహత్కథా సంకలనాన్ని అంకితం చెయ్యడం ముదావహం. అమెరికాలో తెలుగు సాహిత్యానికి అంకురార్పణ చేసి, పోషించి ఈనాటి స్థాయికి తీసుకువచ్చిన వ్యక్తులకు కృతజ్ఞతలు తెలియజేయడం అభినందనీయం.

తొలి పేజీలలో పరిచయ వాక్యాలు రాసిన సంపాదకుడు శ్రీ పెమ్మరాజు వేణుగోపాలరావు, 'నేపథ్యం – వర్తమానం' అంటూ ప్రస్తావించిన శ్రీ వంగూరి చిట్టెన్ రాజు, సంకల నాన్ని అందంగా తీర్చి దిద్ది, ముద్రింపజేసి, కథాభిప్రాయాలు '*కథ – మంచికథ – గొప్ప కథ – అమెరికా తెలుగు కథ*' అంటూ తమ అభిప్రాయాలను, వ్యక్తం చేసిన 'రచన' శాయి – వారి వారి దృక్కోణాలలో అమెరికా తెలుగు కథ స్వరూప స్వభావాల్నీ, రచయితల ఉత్సాహాన్నీ, ధోరణుల్నీ సూక్ష్మంగా వివరించడం జరిగింది.

యికపోతే ఈ బృహత్కథా సంకలనంలో మొత్తం 116 కథలు / కథానికలు ఉన్నాయి. కథలేవీ, కథానికలేవీ అన్న అంశాన్ని పక్కకు నెట్టి రచయితల ఔత్సాహికతనూ, ఎంచు కొన్న యితివృత్తాలనూ, భావ వ్యక్తీకరణకు ఉపయోగించిన అక్షర శిల్పాన్నీ కనక పరిశీలిస్తే గమనించదగ్గ కొన్ని విశేషాలు వ్యక్తమౌతాయి. కొందరు రచయితలు రెండు – మూడు కథలు రాసిన కారణంగా, కథల సంఖ్య 116 అయినా రచయితలు వందమంది దాకా ఉండడం భాష మీది అభిమా నంగా చెప్పుకోవడంలో అసమంజసమేమీ లేదు.

వలస అనేది ఓ నిరంతర ప్రక్రియ. నాగరికత అభివృద్ధి చెందడమనే అంశంలో వలస ప్రధాన పాత్ర వహిస్తూ వచ్చింది. ఈ వలసపోవడమనే ప్రక్రియ వ్యక్తుల ఆశలతో, కలలతో ఆరంభమవుతుంది. యిటీవలి కాలంలో (గత శతాబ్దం మధ్య నుంచి ఈనాటి వరకూ) కేవలం మనుగడ కోసం మధ్య ప్రాచ్యదేశాలకు, తమ ప్రతిభా పాటవాల గుర్తింపు కోసం, మరింత సౌకర్యకమైన జీవితాల కోసం పాశ్చాత్య దేశాలకు వలసపోవడం జరుగుతూనే ఉంది. అయితే ఈ వలస అనేది అనేక సమాజపరమైన సమస్యల్ని సృష్టిస్తుంది.

– కన్నవారినీ, పుట్టి పెరిగిన ఊరినీ వదిలి దూరతీరాలకు పోయిన బాధ అంతర్లీనంగా ఉండడం –

- వృద్ధులైన తల్లిదండ్రుల్ని వృద్ధాశ్ర మాలలో ఉంచడం –
- పురుళ్ళకీ పుణ్యాలకీ కన్నవారిని రప్పించుకోవడం – అలా వెళ్ళినవారికి అక్కడ తోచక విసుగెత్తి పోవడం –
- తమ సంస్కృతికీ, వలస వెళ్ళిన (ప్ర)దేశాల సంస్కృతికీ మధ్య పొందన కుదరక కొంత సంఘర్షణక లోనుకావ డం, కొంత రాజీ పడ్డం –
- అమెరికాలో అడుగు పెట్టడానికి మోసపూరితమైన వీసా వివాహాలూ –
- ఒక వివాహం జరిగిన తర్వాత ఆ పుట్టిన సంతానం పెంపకం కోసం మరో వివాహం –
- ఒరకమైన క్రమబద్ధతకు నిర్వచనమైన అమెరికా జీవన విధానంతో పోల్చుకొని మన సంస్కృతి పట్ల న్యూనతా భావాన్ని పెంచుకోవడం –
- ఈ భావంలోంచే స్వోత్కర్షలు లీలగా గోచరించడం –
- తమ తర్వాతి తరం వారు అక్కడే పుట్టి పెరిగిన కారణంగా ఆ సంస్కృతికి పూర్తిగా అలవాటు పడడం – డేటింగులూ, దేశాంతర వివాహాలూ, వివాహ ప్రసక్తి లేకుండా కలిసి ఉండడం లాంటి విషయాలు సృష్టించే సంఘర్షణలూ –
- అక్కడి సభా సమావేశాలూ, సాంస్కృతిక కార్యక్రమాలూ, రాజకీయాలూ, రసాభాసలూ –

చాలా కథలు యివే యితివృత్తాల చుట్టూ తిరిగాయి. తమ అనుభవాలకు కాల్పనికమైన కథారూపం యివ్వడంలో కొద్దిలో కొద్దిమంది మాత్రమే కృతకృత్యులయ్యారు.

జీవితంపట్ల ఏ యిరువురి దృక్కోణాలూ ఒకేలా ఉండాలని లేదు. ఒకే రకమైన అనుభవంపై యిరువురు స్పందించే తీరు భిన్నంగా ఉంటుంది.

యితివృత్తమొకటే అయినా భావ వ్యక్తీకరణలోని




20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక
మరియు
అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంథం

ప్రచురణ : వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా – హ్యూస్టన్ : హైదరాబాదు

పేజీలు : 478 + 106 = 584 :: వెల : రు. 800/– (మల్టీపెక్స్ థియేటర్లలో నాలుగు టికెట్ల ఖరీదు మాత్రమే!)

*For copies contact* : **Vanguri Foundation of America;** Satya Sai Puram;
**KUNTLOOR** (Village); Hayatnagar (Mandal); HYDERABAD - 501 505; Ph : 98490 23852

వైవిధ్యం కథల్లో గోచరిస్తుంది.

అలాగని ఈ కథలన్నీ వలస సంస్కృతి చుట్టూ రాసినవి కావు. ఆదర్శాలనీ, ఆర్ద్రతలనీ రంగరించి తెలుగు నాడు నడిబొడ్డు నేపథ్యంగా రాసిన కథలూ లేకపోలేవు.

అక్కడి ఆఫీసు వాతావరణంలో అమెరికన్లూ, యితర దేశాల నుంచి వలస వచ్చిన వారూ సహోద్యోగులుగా ఉండడం సహజం. ఈ నేపథ్యంలోంచి తలెత్తే సమస్యలు, సంఘర్షణలు, వర్ణవివక్షలు యిత్యాది విషయాలకు దరిదాపులుగా ఏ ఒక్క కథా పోలేదు. కథలన్నీ వలస వెళ్ళిన మన సమాజం చుట్టూ చెప్పినవే!

అయితే చెప్పుకోదగ్గ విషయేమిటంటే, ఏవో కొన్ని కథల్లో మినహాయించి చక్కటి రీతిలో తెలుగు భాష దర్శనమిచ్చింది. సంస్కృతాంధ్ర పద ప్రయోగాల వలె ఆంగ్లాంధ్ర పదాల ప్రయోగం ఆ కొద్దిపాటి కథల్లో కనబడ్తుంది.

కథావస్తువులెలాఉన్నా, కథనరీతి ఎలా ఉన్నా, తెలుగు పలుకు వన్నె తరగకుండా కృషి చేసిన అమెరికాలోని తెలుగు రచయితలందరూ అభినందనీయులు. మాతృభాష మరుగున పడిపోకుండా, వాక్కుకే పరిమితం కాకుండా, శాశ్వత అక్షర రూపాన్ని నిలబెట్టే ప్రయత్నంగా వంగూరి ఫౌండేషన్ వారు చేస్తున్న కృషి ప్రశంసనీయం.

**– వి.వి.ఆర్.**

అనగనగా ఒక మంచి కథ...



# లోపలి రహస్యం

ఐతే విను మరి—ఆలకిస్తున్నావా? ... అడ్డు ప్రశ్నలు వేయకేం...ఆతర్వాత.

జనం కోలాహలంగా తిరుగుతున్నారు ... వొకటే సంరంభం! ఒకవ్యక్తికి రెండో వ్యక్తితో మాట్లాడే తీరికేలేదు. అటు యిటు పరుగులు తీసే వారి పదఘట్టనలతో ఆ నేల అరిగిపోదు గదా! యెవరినైనా పలకరించాలన్నా గొంతుచించుకుని బిగ్గరగా కేక వేయాలి...అంత కష్టపడ్డా అవతల వ్యక్తి వినిపించుకోవాలిగా అసలు.

పాకశాలనుంచి మధురమైన వాసనలు గాలిలో తేలివచ్చి పువ్వెళ్లూరిస్తున్నయ్...యీ వాసనలకు తోడు రసికులపుణ్యాన అత్తరువాసనలు—నాకేం పాలుపోలేదు.

ఒక్కసారిగా చెవులు దిబ్బళ్లెత్తేట్టు మంగళ తూర్యారవాలు ప్రతిధ్వనించి ఆ కోలాహలాన్ని మింగివేసినై.

'పూఁ...లగ్నం సమీపిస్తున్నది...త్వరపడండి ...పెళ్లికొడుకు, పెళ్లికూతుర్నీ తీసుకురండి... యింకా చూస్తారేమయ్యా...త్వరగా...పూఁ!'

'రావయ్యా!' నన్ను యెవరో రెక్కపుచ్చుకు లాగారు.

'ఎందుకు? ఎక్కడికీ?' అన్నాను.

'ఇదేం వేళాకోళం గాదు. వరుడివి, లగ్నం సమీపిస్తుంటే వొకచెంప!' అతనెవరో నాకు తెలియదు. నన్ను యెందుకు వరు డంటున్నాడో అసలు అంతకీ తెలియదు. దిగ్భ్రాంతుణ్ణిగానుమరీ...? నేచెప్పబోయేది వినకుండా, బరబర యీడ్చుకువెళ్ళి పెళ్ళిపీటలమీద కూలవేశాడు ... అప్పుడు నేనే మన్నా ప్రతిఘటించానా? ఏమో! పోనీ మాట్లాడానా అంటే అదీ గుర్తులేదు.

ఆడవాళ్లు గబగబ యెవరో అమ్మాయిని తెచ్చి నాప్రక్కనే కూచోబెట్టారు ... పెళ్ళని అర్థం చేసుకున్నా ననుకుంటాను అప్పటికి.

యథావిధిగా కార్యక్రమం నాయిష్టాయిష్టాల్తో ప్రమేయంలేకుండనే సాగిపోతున్నది...తలంబ్రాలు పోసేటప్పుడు గావాలి వధువుముఖం చూశాను... యెవరా అమ్మాయి?...యెన్నడు చూడలేదే? మనసు మారుమీధుల్లో నిద్రిస్తున్న ఆలోచనలు కొన్ని మేల్కొన్నయ్...స్మృతిపథాన యేదో తళుక్కుమన్నది...మళ్ళీ చూశాను ... పరిచయమున్న ముఖమే...అవును... నేను రోజూ చూసే ముఖమే...నాకు సన్నిహితమిత్రుల్లో వొకడైన నిరంజన్ భార్య పద్మ...యిదేమిటీ దుర్మార్గం? నన్ను 'అన్నయ్యా' అని పిలిచే ఆవిడ ... వొక మిత్రుడి భార్యతో నాకు పెళ్లిఎలా జరగడం?... ఐతే అంతకుక్రితమే వధువు ఆవిడగాదే...యెవరో చూడనివమనిషే...మరి ఆ అమ్మాయి యేమైంది? చెల్లాయి పద్మ వధువు కావడమేమిటి?...అంతా అయోమయం...కళ్లు గిర్రున తిరిగాయి...బ్రతికే వున్నానా? చనిపోయానా? అనుకున్నాను. ఆ తర్వాత యేం జరిగిందో జ్ఞాపకం లేదు...ఆదరిపాటుతో లేచాను...అంతే!

...అదీ అబ్బాయ్! జరిగిన కల!...

(మిగతా భాగం పత్రికలో చదవండి)

పి. శ్రీనివాసరావు

# కథ... మంచి కథ... గొప్ప కథ... అమెరికా తెలుగు కథ!




'ఈ విషయాలన్నీ అందరికీ తెలిసినవే గదా!' అన్న ఆలోచన మదిలో మెదలగానే 'ఈ గ్రంథ సంపాదకులు ప్రత్యేకంగా నన్నెందుకు నాలుగు మాటలు రాయమన్నారు?' అన్న ప్రశ్న ఉదయించింది. దాంతోపాటే చిరు సమాధానమూ స్ఫురణకు వచ్చింది.

హైస్కూలు రోజుల నుంచీ కథ పట్ల ఉన్న ప్రేమ, ఆరాధన కొన్ని వేల కథలను చదివించింది. వాటన్నింటినీ పదిలపరిచేలా చేసింది. చాలామంది కథకులకు వారు పోగొట్టుకున్న కథల కాపీలను అందించే అవకాశం కలుగ జేసింది. రెండొందల పైగా కథలు రాయించింది.

1970 నుంచీ శ్రీ కిడాంబి రఘునాథ్‌గారు అప్పటప్పటా పంపిన "తెలుగుజ్యోతి" సంచికల ద్వారా అమెరికా కథకుల రచనలతో పరిచయం ఏర్పడింది. తర్వాత 'రచన' మాసపత్రిక ప్రారభించడంతో ఆ పరిచయం ప్రగాఢమయింది. ప్రారంభ సంచిక నుంచీ అమెరికా రచయితల రచనలు తరచుగా ప్రచురించడం అందరికీ తెలిసిన విషయమే! తర్వాత్తర్వాత ఆయా సంస్థలవారు కోరిన మీదట, వారికి వార్షిక సంచికలూ మొదలయినవి తయారుచేసిపెట్టడం జరిగింది. అందులో కొన్ని : 'సాహిత్యలహరి' – ఆటా 2000, అట్లాంటా; 'తొలకరి' – ఆటా 2002, డాలస్; 'తెలుగు వెలుగు' – టి.ఎల్.సి.ఎ., న్యూయార్క్ వారికి తారణ, స్వభాను ఉగాది సంచికలు; 'మధురవాణి' – రజతోత్సవ సంచిక – 2003, హ్యూస్టన్; 'తెలుగు పలుకు' – తానా సిల్వర్ జూబ్లీ – 2003; 'ప్రవాసారామం' – ఆటా 2004, చికాగో; 2002 నుంచీ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి ప్రచురణలు; ఆటా వారి 'అమెరికా భారతి', 'తానా పత్రిక'లకు తెలుగు విభాగాలు కొంత కాలం; 'సుజనరంజని' – సిలికానాంధ్ర, 2002, 2003 మరియు వారి ఇతర ప్రచురణలు; మరికొన్ని ఇతర సంస్థల ప్రచురణలు కొన్నేళ్ళ పాటు...మొదలయినవి. వీటన్నింటినీ తయారించడంతో స్వదేశాంధ్ర రచనలతో బాటుగా విదేశాంధ్ర రచనలతోనూ విశేషంగా పరిచయం ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని నన్నీ నాలుగు మాటలు రాయామన్నారనిపించి రాయడం జరుగుతోంది.

❖ ❖ ❖

'అనగనగా ఒక రాజు...ఆ రాజుకు ఏడుగురు కొడుకులు...' అంటూ చాలామంది ఏదో ఒక సందర్భంలో తమ పిల్లలకు 'ఎండని ఏడో చేప కథ' చెప్పకుండా ఉండి ఉండ డం అరుదు. ఈ కథ రాసిందెవరో, ఎన్నేళ్ళ క్రితం పుట్టిందో ఊహకు అందని విషయం. అలాగే 'పేదరాసి పెద్దమ్మ కథలు', 'కాశీమజిలీ కథలు' మొదయినవి. ఇవన్నీ చిన్నతనంలో వినిఉండడంతో భవిష్యత్తులో సృజనాత్మ కతకు మెరుగు పెట్టడం జరిగింది – చాలామంది విషయంలో. అలాంటి వారే కథకులుగా రూపాంతరం చెంది తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

కొన్ని దశాబ్దాలుగా తొలి ఆధునిక కథగా గురజాడవారి 'దిద్దుబాటు' (1910) ను అందరూ అంగీకరిస్తూ వచ్చినా, గత దశాబ్దంలో భండారు అచ్చమాంబగారి 'ధనత్రయోదశి' (1902); ఆచంట సాంఖ్యాయనశర్మగారి 'లలిత' (1903); మాడపాటి హనుమంతరావుగారి 'హృదయశల్యము' (1912) కథలు తొలి తెలుగు కథలుగా విజ్ఞులచేత ప్రతిపాదించబడ్డాయి. తొలి ఆధునిక కథ ఏదన్న వివాదాన్ని ప్రక్కన పెట్టి వీరందరినీ తొలి తెలుగు ఆధునిక కథకులుగా పరిగణించడంలో ఔచిత్యమున్నదన్నది స్వాభిప్రాయం.

ఇలాంటి వివాదం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వలస వెళ్ళిన కథకుల విషయంలో తలెత్తలేదు. తొలి అమెరికా తెలుగు కథగా గుర్తించబడిన 'వాహిని' (1964) లో పాత్రలు భారతీయులవే అయినా సన్నివేశాలు, వాతావరణం అన్నీ అక్కడివే కావడం విశేషం! పైగా రచయిత అంతకు ముందు మన దేశంలో ఉన్నప్పుడు 'విజయ' అనే పేరుతో చాలా కథలు రాసినా, 1963లో వలస వెళ్ళి అక్కడే రాసిన ఆ కథ 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక'

(24-4-1964) లో ప్రచురింపబడింది. తర్వాత రెండు, మూడు స్థానాల్లో ఉన్న కథల్లోని కథావస్తువూ, వాతావరణమూ మన ఆంధ్రప్రదేశ్‌కు చెందినవి. అవి రాయబడిందీ ఆ రచయితలు మన దేశంలో నివాసమున్న కాలంలోనే!

ఏది గొప్ప కథ, ఏది మంచి కథ అన్న చర్చ నిరంతరం సాగుతూనే ఉంటుంది. అది సహజం! అయితే లబ్ధప్రతిష్టులైన కథావిమర్శకులూ, వ్యాసకర్తలూ గురజాడవారితో మొదలుపెట్టి శ్రీపాదవారి మీదుగా ప్రయాణించి రావిశాస్త్రి, కారాగారల దాకా వచ్చి ఆగిపోతుంటారు. ఇంకొంచెం సాగదీస్తే స్వామి, అల్లం రాజయ్యల దాకా వస్తారు - వాళ్ళిప్పుడు రాయడం మానేసినా కూడా! ఈ విశ్లేషకులందరూ ప్రస్తావించే పేర్లన్నీ ప్రసిద్ధులవే! వారిని స్మరించడం ఉచితమే! కానీ, ఎప్పుడూ ఆ కథకుల పేర్లు మాత్రమే పునరావృతం కావడం ఎంత వరకు సబబు? చాలా ప్రాచుర్యం పొందని కథకుల పేర్లు మనకు తటస్థ పడవు - ఎందుకనేది యక్షప్రశ్న కాదుగానీ జవాబు దొరకని ప్రశ్న.

ప్రస్తుత సందర్భం *'అమెరికా తెలుగు కథానిక'* కాబట్టి అక్కడి కథాసృష్టి గురించి కూడా ఒకసారి పర్యావలోకనం చేసుకోవడం సముచితం. 1980 దాకా అమెరికా సంయుక్త రాష్ట్రాలకి తరలి వెళ్ళిన భారతీయుల సంఖ్య అంత గణనీయం కాదు. అందులో తెలుగువారి శాతం కూడా అంతకు తగ్గంతే! వారిలో సాహిత్యాభిలాషుల సంఖ్య కూడా తక్కువ కావడం, వృత్తిపట్ల, అక్కడి స్థానిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా అలవాటు పడడానికి పట్టిన దీర్ఘకాల వ్యవధీ...తదితర కారణాల వల్ల సాహిత్య సృష్టి వేగంగా జరగలేదనిపిస్తుంది. వేమూరి వేంకటేశ్వరరావుగారు అంతటి ఒత్తిడులలోనూ సాహిత్య సృష్టి చేసిన వారిలో అగ్రగణ్యులు. వృత్తిరీత్యా కంప్యూటర్ మనిషి అయినా, ఆయన రాసిన సైన్సు వ్యాసాలు, కథలు చదివి మెడికల్ డాక్టర్ అనుకుని ఎందరో ఆయన్ని సంప్రదించారని తెలిసినప్పుడు ఆయన రచనలు ఎంత నిబద్ధతతో కూడినవో మనకు అవగతమవుతుంది. ముఖ్యంగా *"రసగంధాయ రసాయనం"* (1991) చదివినవారు ఆయనొక లబ్ధప్రతిష్టుడైన రసాయనశాస్త్ర శాస్త్రజ్ఞుడనుకుంటారు. అలాగే 'మానవ రక్తం' గురించి రాసిన *"జీవనది"* (1999) గ్రంథం చదివినవారు ఆయన కంప్యూటర్ డాక్టర్ అంటే ఒక పట్టాన నమ్మరు - మెడికల్ డాక్టరనే నమ్మడానికి మొగ్గుచూపుతారు. వారి *'అభయారణ్యంలో ఏంబర్'* కథలో అమెజాన్ అడవుల్నీ, *'భయం'* కథలో ఉత్తర ధృవ ప్రాంతంలోని అలాస్కా మంచుభూమినీ దర్శించినవారు ఆయనొక ప్రపంచ యాత్రీకుడనీ అనుకోక మానరు. రెండు మూడు దశాబ్దాలపాటు దశల వారీగా సవరించుకుంటూ, సమగ్రం చేసుకుంటూ వచ్చి 2002లో *"తెలుగు - ఆంగ్లం - తెలుగు సాంకేతిక పరిభాషా పదకోశం"* ప్రచురించారు. ఎన్నో ఆంగ్ల సాంకేతిక పదాలకి సాధికార తెలుగు పదాలను సృష్టించారు. ఆయన ప్రవృత్తి వృత్తిని అధిగమించిందా అన్న అనుమానం రాక మానదు. అందుకే *'బహుముఖీన ప్రజ్ఞాశాలి'* అన్నదానికి నిఖార్సయిన దర్పణం డా. వేమూరి వేంకటేశ్వరరావుగారు. ఇలాంటి మొదటి తరం (పెమ్మరాజు వేణుగోపాలరావు, చెరుకూరి రమాదేవి ప్రభృతులు) వారు ఆ తర్వాతి కాలంలో అక్కడికి వెళ్ళిన వారికి మార్గదర్శకులూ, దిశానిర్దేశకులూ అయి మలి తరం వారు అక్కడ తక్కువ ఇబ్బందులతో స్థిరపడడానికి తోడ్పడ్డారు. ఇలాంటి వారి అవిరళ కృషి ఫలితంగానే తర్వాతి తరాల వారి జీవనసరళి సుగమమయింది అక్కడ.

ఈ క్రమంలోనే చాలామంది తీరికచేసుకుని సృజనాత్మక రచనావ్యాసంగం వైపు దృష్టి మళ్ళించి కృషిచేసి సత్ఫలితాలను సాధించారు. మాతృభూమికి దూరంగా ఉన్నప్పుడు మాతృభాషపై మరింత మమకారం పెంపొందడం సహజం గదా!

1980 - 2002 మధ్య కాలంలో కథారచన చెప్పుకోదగ్గ వేగం, పురోగతి సాధించింది. చాలా మంచి కథలు చాలానే వచ్చేయి. ఆ తర్వాత మరింత ఉధృతమయ్యింది. అయినా అక్కడ నివసిస్తున్న కథకుల గురించీ, వారి కథల గురించీ ఇక్కడి సాహితీలోకానికి కొంత చిన్నచూపు ఉన్నదన్నది వాస్తవ దూరం కాదు. *"ఏదో పనిలేక రాస్తుంటారు... వాళ్ళ కథల్లో వస్తువు బావుండదు... శైలీ శిల్పాలు మృగ్యం..."* లాంటి విమర్శలు ఇక్కడ తరచూ వింటుంటాం. అలా విమర్శించే వాళ్ళు అక్కడి వారు రాసిన కథల్ని అసలు చదివేరా? చదువుతున్నారా? అమెరికాలో ఉన్నా అంబాజీపేటలో ఉన్నా కథకుడు కథకుడే కదా! కథ ఎలాంటిదన్నది ముఖ్యంగాని ఎక్కడున్న వాడు రాసిందన్నది అప్రస్తుతం గదా!

ఒక చిన్న విశ్లేషణ చూదాం.

రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి కథలన్నింటినీ అందరు ఆస్వాదిస్తారు - గొప్పవని కీర్తిస్తుంటారు - ఒక్క *"అఖరి దశ"*ను మాత్రం పట్టించుకోరు, ఉటంకించరు. ఎందుకంటే దానిలో వాదాలు లేవు... సంఘర్షణలు లేవు... ఉపమానాలు లేవు... ఉద్యమాలు లేవు... కష్టాలు లేవు... కన్నీళ్ళు లేవు... ఒళ్ళు గగుర్పొడిచే సన్నివేశాలు, సంభాషణలు లేవు... నినాదాలూ లేవు... లేకపోగా, దేవుళ్ళున్నారు...గాంధీ ఉన్నాడు. కానీ ఆ కథలో ప్రపంచం మీద విశ్వజనీనమైన ప్రేమ చిప్పిల్లుతూ ఉంటుంది! ప్రపంచంలోని ఏ భాషలోకి అనువదించబడ్డా

గొప్పగా ఇమిడిపోయే కథ అది!

ఆ కథతో పోల్చడం తగదుకానీ – అమెరికా రచయిత ఎస్. నారాయణస్వామిగారి *"తుపాకి"* (ఈ సంకలనంలోని 109వ కథ) దానికి వంద గజాల దూరంలో నిలుస్తుంది. ఆ కథ ఇక్కడి గొప్ప కథకులనబడే వారి కథలకు ఏమాత్రం తీసిపోనిది. ఇంకా చెప్పాలంటే వాటికన్న ఒక మెట్టు పైనే ఉంటుంది. ప్రపంచంలో నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు లేని ప్రాంతం లేనేలేదుగద! జాతి వైషమ్యాన్ని నిలువుటద్దంలో చూపి, సానుకూల...సమంజస పరిష్కారం చూపిన కథ ఇది. ప్రపంచ భాషల్లో దేనిలోనైనా సజావుగా ఇమిడిపోయి, ఆ కథ ఆ ప్రాంతానికీ, ఆ భాషకీ సంబంధించినదేనని తలపింపజేసే గొప్ప కథ ఇది!

ఈ కథా సంకలనం 20వ శతాబ్దానికే పరితమయింది. ఆ కారణంగా తర్వాతి తరం కథకులకు ఇందులో చోటు దొరకలేదు. కానీ, ఇప్పుడు పరిపుష్టి గలిగిన కథలను అల్లుతున్న నవతరం కథకులకు కొదవ లేదు. వారిలో కొందరు – తాడికొండ శివ కుమారశర్మ, మద్దూరి శివప్రసాద్, దంతుర్తి రామలింగశర్మ, వేద, మహేష్ శనగల తదితరులు. తాడికొండవారి *"రహస్యం"*, *"విదేశగమనే విద్యా పరాదేవతా"*, శనగలవారి *"గుగ్గిళ్ళమ్మ గుడి"* చదివితే అక్కడ తెలుగు కథ ఎంతటి జవసత్వాలతో ఉప్పొంగుతుందో, అలరారు తోందో తెలిసివస్తుంది.

అక్కడివారి కథలను *'అమెరికా రచయిత'* అనే భావన వీడి చదివితే ఆ కథల ఔన్నత్యం మనకు అవగతమవుతుంది. కథకుడు ఎక్కడివాడన్నది కాదు ముఖ్యం – ఎలాంటి కథ అది అన్నది ప్రధానం. ఆ దృష్టి ఇక్కడి మనవారిలో పెరగాలన్నది ఆకాంక్ష!

*చాలా మంచి కథ ఒకటి రాసినా వారిని గుర్తించడం సముచితం – ధర్మం! తెలుగు కథకు న్యాయం చేసినట్లవుతుంది.*

*'భారతి'* మాస పత్రికలో పదిహేనుకు పైగా కథలు ప్రచురింపబడిన ఏకైక రచయిత ఆర్.యం.చిదంబరం. దేవరకొండ బాలగంగాధర తిలక్ కవికులతిలకుడే – సందేహం లేదు. కానీ *'ఊరి చివరి ఇల్లు'*, *'అతను'* ఆయనకు కథాతిలకం దిద్దగల సత్తా ఉన్న కథలు. ధనికొండ హనుమంతరావుగారి *'గళ్ళ రుమాలు'*, సి.రామచంద్రరావుగారి *'టెన్నిస్ టోర్నమెంట్'* (నాకూ, ఆయనకూ ఇష్టమైన కథ), పూసపాటి కృష్ణంరాజుగారి *'సీతాలు జడు పడ్డది'*, *'రెండు బంట్లు పోయాయి'*, నూజివీటి చాగయ్యగారి *'చికీర్ష'*, గంధం యాజ్ఞవల్క్యశర్మగారి *'సెలవ యింది'*, సి. వేణుగారి *'నవ్విన ధాన్యరాశి'*, తాడిగిరి పోతరాజు గారి *'సర్టిఫికెట్ పోయింది'*, *'పావురాలు'*, రంగధామ్‌గారి *'సజీవ శిల్పం'*, కవనశర్మగారి *'చిన్న చిన్న బాటసారులున్నారు జాగ్రత్త!'*, తెనాలి సుశీలాదేవిగారి *'ది మెర్సీ కిల్లింగ్'*, జొన్నలగడ్డ రాజగోపాలరావుగారి *'రేపటిదాకా ఆగు'*, జయంతి వెంకటరమణగారి *'వంతెన'*, డి. వెంకట్రామయ్యగారి *'మనుషుల్నితినే వాళ్ళు'*, *'కూడుతినే బల్లి'*, చంద్రగారి *'బడ్జెట్ జీవితం'*, *'వెన్నెల ఆశ్చర్య పోయింది'*, యం. రామకోటిగారి *'శకటిక'*, గొల్లపూడి మారుతీరావుగారి *'తాజ్‌మహల్'*, బి. శశిగారి *'ఎయిత్ వండర్'*, యండమూరి వీరేంద్రనాథ్‌గారి *'సీతా రాముడొస్తున్నాడోయ్'* .....ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో.... ఎన్నెన్నో కథారత్నాలు మనకి దొరుకుతాయి – ఏరుకునే ఓపిక ఉండాలే గానీ! ఉన్నపళంగా ఇలాంటి ఓ వంద కథల పేర్లు చెప్పగలను. ఇటువంటి కథకుల కథలకి సాహిత్య అకాదెమీలూ, విశ్వవిద్యాలయాలూ, ప్రముఖ సాహితీ సంస్థలూ ప్రచురించే సమగ్ర(?) కథాసంకలనాల్లో స్థానం లభించడం చాలా చాలా అరుదు. అందుక్కారణం ఒక్కటే గోచర మవుతుంది – ఇలాంటి కథకుల పేర్లు తరచూ అందరి నోళ్ళలో నానుతూ ప్రస్తావనకు రాకపోడమే! "కథ"లను ఎంపిక చేయాలిగానీ "కథకుల" కథలను ఎంపిక చేస్తే కలిగే పరిణామమే యిది.

ఇదంతా ఇప్పుడు ఎందుకు ప్రస్తావించాల్సివచ్చిందంటే ఈ *"20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక"* సంకలనానికి కథల ఎంపికలో సంపాదకులు చూపిన సంయమనం హర్షణీయం అనిపించబట్టి! చాలామందివి ఒకటొక్కటీ, కొందరివి రెండు రెండూ, మరిద్దరివి మూడు ఈ సంకలనంలో చోటుచేసు కున్నాయి. అంతే! ఒక కథకుడు *'నే రాసింది ఒకే ఒక్క కథ – దాని కిందులో చోటు దొరకడం నాకు గర్వకారణం'* అనడం గమనించదగ్గ విషయం. ఆ విధంగా అక్కడ ఉంటున్న అందరు రచయితల కథలకూ ప్రాతినిధ్యం లభించినట్లయింది. ఇంతటి బృహత్ప్రయత్నంలో కొందరు కథకులకు స్థానం లభించకపోయి ఉండిఉండవచ్చు. అందుకు తగిన కారణాలు ఉండే ఉండి ఉంటాయి – వారి కథలు అందుబాటులో లేకపోవడం వంటివి.

ఈ కథాసంకలనంలోని కొన్ని కథలూ, కథావస్తువులూ మన దేశానికి సంబంధించినవి అయి ఉన్నాయి. మరికొన్ని అక్కడి జీవితానికీ, సమస్యలకూ, ఆటుపోట్లకూ దర్పణం పట్టాయి. ఏతావతా అన్ని కథలూ చదివితే రెండు దేశాలకూ కథాసాహిత్య వారధి ఈ సంకలనం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. దీన్ని ఒంటి చేత్తో ...కాదు కాదు...రెండు చేతుల్తో సాధ్యం చేసిన సంపాదకులిద్దరూ అభినందనీయులు!

14 ఫిబ్రవరి, 2009 – 'రచన' శాయి

*('20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక'కి రాసిన ముందుమాట)*